విశాలాంధ్ర
విజయనగరం
పేజి నెం. 8
గురువారం 23, మే 2024

ప్రజలంతా సైబరు మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సిఐ నాగేశ్వరరావు

విశాలాంధ్ర-బొబ్బిలి: ఇటీవల ఫెడెక్స్ కొరియర్ పేరుతో వచ్చే కాల్స్‌తో ప్రజలు సైబరు మోసాలకు గురవుతున్నారని, ఇటు వంటి నకిలీ కాల్స్ పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పట్టణ సిఐ నాగేశ్వరరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఫెడెక్స్, బ్లూ డాట్ వంటి కొరియర్ సర్వీసులతో వచ్చే నకిలీకాల్స్‌ను నమ్మి, సైబరు మోసాలకు గురికావద్దన్నారు. ఈ తరహా సైబరు మోసగాళ్ల కాల్స్ కు భయపడాల్సిన పని లేదని, ఇటువంటి కాల్స్ కు ప్రజలెవ్వరూ స్పందించ వద్దని, ఆయా నంబర్ల నుండి వచ్చే కాల్స్ ను బ్లాక్ చేసి, సమాచారాన్ని స్థానిక పోలీసు స్టేషనుకు అందించాలన్నారు. ఎవరైనా నగదును పోగొట్టు కొన్నట్లయితే 1930 కు లేదా నేషనల్ సైబరు క్రైంపోర్టల్ లో రిపోర్టు చేయాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు.

పకడ్బంధీగా పరీక్షలు నిర్వహించాలి : కలెక్టర్ నాగలక్ష్మి

టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీపై సమీక్ష

విశాలాంధ్ర-విజయనగరం: ఈ నెల 24వ తేదీ నుంచి జరగనున్న పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బంధీగా ఏర్పాట్లుచేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. పదోతరగతి, ఇంటర్, ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు, డిఇఇసెట్ నిర్వహణపై తన ఛాంబర్‌లో బుధవారం సమీక్షించారు. పరీక్షలకు చేస్తున్న ఏర్పాట్లను ఆయా శాఖల అధికారుల ద్వారా తెలుసు కున్నారు. పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లుచేయాలని, మాల్ ప్రాక్టీస్ జరగకుండా చర్యలు తీసుకోవాని ఆదేశించారు. దీనికోసం ఎంపిడిఓలు, తాశిల్దార్లతో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలవద్ద 144 సెక్షన్ అమలుచేయాలని, సమీపంలోని జెరాక్స్, నెట్ సెంటర్లను మూసివేయాలని సూచించారు. ప్రశ్నాపత్రాల స్ట్రాంగ్ రూములవద్ద పటిష్ట భద్రత కల్పించాలని, వాటిని తరలించేటప్పుడు తగిన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని చెప్పారు. పరీక్షా కేంద్రాలను ముందుగానే తనిఖీ చేసి, అన్ని వసతులూ కల్పించాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, ఆర్టిసి బస్సు సౌకర్యాన్ని కల్పించాలని, వైద్య శిబిరా లను ఏర్పాటుచేయాలని సూచించారు. పరీక్షలను సజావుగా నిర్వహిం చేందుకు, అవసరమైన సహాయాన్ని అందించేందుకు ఆయా ప్రభుత్వ శాఖలు కంట్రోలు రూములను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఇఓ ఎన్.ప్రేమ్‌కుమార్, ఆర్ఐఓ ఎం.ఆదినారాయణ, డివిఇఓ ఎస్.భీమశంకర్, డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, డిఇసి సభ్యులు ఎం.సత్యనారాయణ, కె.అప్పారావు, ఎస్.రామకృష్ణ, అసిస్టెంట్ కంట్రోలర్ టి.సన్యాశిరాజు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

24 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

ఈ నెల 24 నుంచి జూన్ 3 వరకు పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయి. ఈ పరీక్ష ఉదయం 9.30కి మొదలై మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతుంది. మొత్తం 4210 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో 2482 మంది బాలురు, 1728 మంది బాలికలు ఉన్నారు. వీరికోసం జిల్లా వ్యాప్తంగా 19 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షా కేంద్రాలకు 19 మంది ఛీఫ్ సూపరింటిండెంట్‌లను, 19 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లు, 185 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేస్తున్నారు.

24న డిఇఇ సెట్

ఈ నెల 24వ తేదీన డిఇఇ సెట్ జరుగుతుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరిగే ఈ పరీక్ష కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో, స్థానిక జెఎన్‌టియు జంక్షన్ సమీపంలోని సత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో నిర్వహిస్తారు. మొత్తం 256 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నారు.

జూన్ 1 నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ

ఓపెన్ స్కూల్ పదోతరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 1 నుంచి 8 వరకు జరుగుతాయి. ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటలు వరకు జరిగే ఈ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పదోతరగతి పరీక్షలకు 4 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, 548 మంది రాయనున్నారు. ఇంటర్ పరీక్షలకు 3 పరీక్షా కేంద్రాల్లో 664 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ప్రతీ పరీక్షా కేంద్రానికి ఒక ఛీఫ్ సూపరింటిండెంట్, ఒక డిపార్ట్‌మెంట్ అధికారిని నియమించారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్లు, 65 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేస్తున్నారు. వీరికి ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 10 నుంచి 12 వరకు జరుగుతాయి.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

ఈ నెల 24 నుంచి 31 వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయి. మొదటి సంవత్సరం విద్యార్థులు 14,904 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 7927 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. మొత్తం 42 పరీక్షా కేంద్రాల్లో, మొదటి సంవత్సర పరీక్ష ఉదయం 9 నుంచి 12 గంటలు వరకు, రెండో సంవత్సర పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు జరుగుతుంది. ప్రతీ పరీక్షా కేంద్రానికి ఒక ఛీఫ్ సూపరింటిండెంట్, మరో అదనపు ఛీఫ్ సూపరింటిండెంట్‌ను నియమించారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను, 500 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

టీడీపీ కార్యకర్తకు కోళ్ళ లలితకుమారి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-శృంగవరపుకోట: కాలువలో పడిపోయి తీవ్రంగా గాయ పడ్డ కొత్తవలస మండలం, వీరభద్ర పురం గ్రామానికి చెందిన టీడీపీ కార్య కర్త చింతాడ అర్జునరావుని ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి బుధవారం పరామర్శించి రూ.15వేల ఆర్థిక సాయమందించారు. సార్వత్రిక ఎన్నికల రోజు కాలువలో పడిపోయిన కారణంగా తన కాలికి గాయం తగలగా కుటుంబ సభ్యులు ఎస్.కోట పట్టణ కేంద్రంలో గల వరలక్ష్మి హాస్పిటల్లో చేర్పించారు. భవిష్యత్‌లో కూడా అండగా ఉంటానని అర్జునరావుకి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

సత్యసాయిబాబా సేవాసమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-రాజాం: విజయనగరం జిల్లా రాజాం శ్రీ సత్యసాయిబాబా మందిరం సేవా సమితి (శివం మందిరం) బాబానగర్ వారి ఆధ్వర్యంలో రాజాం పాలకొండ రహదారిలో బాబానగర్ జంక్షన్ వద్ద ప్రతిరోజు 3వేలమందికి మజ్జిగ పంపిణీ జరుగుతుంది. ఈ సేవా కార్యక్రమంలో శివం మందిరం శ్రీసత్య సాయిబాబా సేవాసమితి సభ్యులు ప్రతి రోజు పాల్గొనడం జరుగుతున్నది. నిర్వాహకులు మాట్లాడుతూ ఈ సేవా కార్యక్రమం ప్రతి ఏడాది వేసవికాలంలో ప్రతిరోజు నిర్వహించబడుతుందని తెలిపారు.

శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయ నిర్మాణానికి 63 వేలు వితరణ

విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల జి అగ్రహారం రైల్వేస్టేషన్ సమీపాన వెలసిన శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయ నిర్మాణానికి దాతలు 63 వేలను విరాళం గా అందజేశారు. బుధవారం స్థానిక ఆలయ నిర్మాణ ప్రాంగణం వద్ద జి అగ్రహారం గ్రామమునకు చెందిన మండల పైడితల్లి. మండల ఆదినారాయణలు వితరణగా సమకూర్చిన 63,000 నగదును శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయ నిర్వహణ కార్యక్రమ సభ్యులు ఆలయ నిర్మాణ కార్యక్రమ కమిటీ సభ్యులు కోట్ల లక్ష్మణరావు నకు అందజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు అగ్రహారం గ్రామ ప్రజలు నిర్మాణ దాతలు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-లక్కవరపుకోట: మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో బుధవారం మూడవరోజు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించినట్లు శాఖా గ్రంధాల య అధికారి బి మేరీ నిర్మల తెలిపారు తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పాఠకులకు క్యారమ్స్, చిత్రలేఖనం, కథలు వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిం దని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, 27 మంది పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా కానుకల పంపిణీ కేంద్రాన్ని సందర్శించిన సిఎంఓ

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో బుధవారం విద్యా కానుకలు మం డల స్థాయి పంపిణీ కేంద్రంను సమగ్ర శిక్ష సిఎంఓ ఆదినారా యణ, అసిస్టెంట్ సిఎంఓ రామా రావు సందర్శించారు. కార్యక్రమం లో భాగంగా విద్యా కానుకల పంపిణీ కేంద్రంలో గల వసతులు, భద్రతా ఏర్పాట్లు,రికార్డ్స్ పరి శీలించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. విద్యాకానుకలు భద్రపర చుటలో, పంపిణీలో ఏవిధమైన లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తరువాత సిఆర్పీలు, పార్ట్ టైం ఇన్స్ట్రక్చర్స్, ఎంఆర్‌సి స్టాఫ్‌తో సమావేశం నిర్వహించారు. విద్యాకానుక విజయవంతం చేయుటలో సిఆర్‌పిలు ప్రధానపాత్ర పోషించాలని సూచించారు. అన్ని పాఠశాలలకు విద్యాకానుకలో గల ప్రతీ వస్తువు, పుస్తకాలు సక్రమంగా అందేటట్లు సిఆర్‌పిలు తగు ప్రణాలికలు, రూట్ మ్యాప్ తయారు చేసు కోవాలని సూచించారు. కార్యక్రమంలో సిఎంఓ, అసిస్టెంట్ సిఎంఓ, ఎంఈఓ-1 & 2, సిఆర్ఎంటి లు, పిటిఐ, ఎంఆర్ సి స్టాఫ్ పాల్గొన్నారు

భౌతికకాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం మండలం కునాయ వలస గ్రామానికి చెందిన బొబ్బిలి నియోజకవర్గ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు తండ్రి, విశ్రాంత ఉపాధ్యాయులు బొమ్మి ఆనందరావు మంగళవారం మధ్యాహ్నం అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న బొబ్బిలి నియోజకవర్గ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు. ఆయన భౌతికకాయనికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆనందరావు ఆత్మకు శాంతి కలగాలని తన ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులును పరామర్శించారు.ఆయన వెంట వివిధ గ్రామ సర్పంచులు, వైసీపీ నాయకులు ఉన్నారు.

పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీష్ పై అవగాహన

విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం శాఖా గ్రంధాల యంలో బుధవారం వేసవి విజ్ఞాన శిభిరంలో భాగంగా స్పోకెన్ ఇంగ్లిష్ పై అవగాహన కల్పించారు. అలాగే పుస్తక పఠనం ప్రాముఖ్యత గురించి ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.అనూష ఆంగ్ల పదాలు ఏవిధంగా పలకాలి, ఏ విధంగా చదవాలి, ఇంగ్లీష్ ఎలా మాట్లాడాలి అన్న విషయాలను ఎక్కువ ఇంగ్లీషు పుస్తకాలను చదవడం, వ్రాయడం చేయాలని తెలియజేసారు. ఈ కార్యక్రమానికి సి. హెచ్ దీపికా టీచర్ పాల్గొన్నారు. అని స్థానిక గ్రంధాలయ అధికారి సిహెచ్ కృష్ణమూర్తి తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

పట్టణ సిఐ దాడి మోహన్ రావు



విశాలాంధ్ర-రాజాం : సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజాం సీఐ దాడి మోహన్‌రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతికత అభివృద్ధి చెందే కొద్దీ మోసాలు అధికమవుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటర్ నెట్, స్మార్ట్ ఫోన్లు వినియోగిస్తున్న నేపథ్యంలో మోసగాళ్లు రకరకాల మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, లింకులను క్లిక్ చేయకూడదని ప్రజలకు సిఐ దాడి సూచించారు.

టీడీపీ సీనియర్ నేత అనంతయ్య మృతి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, వైకె బీఈడీ కళాశాల యాజమాన్య ప్రతినిధి యనమదల అనంతయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈయన గతంలో కొత్తవలస మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్, అలాగే వ్యవసాయశాఖ జిల్లాలో ఉన్నత అధికారిగా విధులు నిర్వ హించారు. ఎస్.కోట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలంగా ఉంచడంలో అనంతయ్య పెట్టింది పేరు. అనంతయ్య మృతి పట్ల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, ఎంపీపీ ఎస్.సోమేశ్వర రావు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాణి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అనంతయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రారంభమైన శ్రీ దారగంగమ్మ అమ్మవారి ఘటాలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోట గ్రామదేవత, భక్తుల కొంగుబంగారం శ్రీదార గంగమ్మ తల్లి ఘటాలు తిరిగే కార్యక్రమం బుధవారం ఉదయం నుంచి ప్రారంభమ య్యాయి. దారగంగమ్మ అమ్మవారు కొలువై ఉన్న గొల్లవీధి గద్దె గుడి నుండి అనువంశిక పూజారి మోపాడ గౌరినాయుడు ప్రత్యేక పూజలు అనంతరం ఘటాలను పూజారమ్మ విల్లా సత్యవతి తలకు ఎత్తుకుని గ్రామంలోని వీధుల్లో తిరిగారు. ఈ సందర్భంగా అనువంశిక పూజారి గౌరినాయుడు మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ వరకు ఘటాలు తిరుగుతాయని వెల్లడించారు. ప్రతిరోజూ ఉదయం జంగిడి ఘటం, మధ్యాహ్నం పాలఘటం, రాత్రి కూటి ఘటం ఇలా మూడు పూటలు అమ్మవారి ఘటాలు తిరుగుతాయని వివరించారు.

భలే మంచి చౌక బేరం

- ఎకరా గెడ్డపోరంబోకు భూమి లక్ష రూపాయలకే...
- డీ పట్టా, గెడ్డ పోరంబోకు భూముల విక్రయం
- భూముల వ్యవహారంపై వీలుపర్తి గ్రామ ఉపసర్పంచ్ కు బెదిరింపులు

ప్రభుత్వ భూములను చూపుతున్న రైతుల దృశ్యం

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని వీలుపర్తి రెవెన్యూలో గల గెడ్డ వాగు,డీ-పట్టా భూములు కారు చౌకుగా అమ్మకాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. గ్రామ రెవిన్యూ లోని సుమారు13 ఎకరాల జిరాయితీ భూములతో పాటు సర్వే నెంబరు 4,6లలో 26 ఎకరాల గెడ్డ పోరంబోకు భూమి,సర్వే నెంబరు 2,4,6లలో గల ఢీ-పట్టా భూములు 33 ఎకరాలతో పాటు వేపాడ రెవిన్యూ గల మరో 30 ఎకరాల వరకు డీ-పట్టా భూములను బోస్ రాజు అండ్- కో వారు గతంలో రైతుల నుండి కొనుగోలు చేసుకున్నారు. ఈ భూములలో చేపలు చెరువులు, పలు రకాల పండ్ల తోటలు తదితర పంటల సాగులను చేపడుతున్నారు. అయితే ఇటీవల కాలంలో వీరు కూడా ఓ ప్రముఖ సంస్థకు ఈ భూములను గెడ్డ పోరంబోకు భూమి ఎకరాకు రూ.లక్ష రూపాయలు, డీ పట్టా భూములు రెండు లక్షల వరకు ధర నిర్ణయించుకొని అమ్మకం చేస్తున్నట్లు గ్రామానికి చెందిన పలువురు రైతులు గ్రామ ఉపసర్పంచ్ గోకాడ అచ్చంనాయుడు తదితరులు పేర్కొంటున్నారు. ఈ భూముల విక్రయాల వ్యవహారం లో అడ్డు తగులుతూ రైతుల పక్షాన ఉప సర్పంచ్ అచ్చం నాయుడు మాట్లాడడంతో ఆగ్రహా నికి గురైన భూ కొనుగోలు దారులు శృంగవరపుకోట రూరల్ సీఐ ఉపేంద్ర ను ఆశ్రయించగా సదరు సీఐ భూ వ్యాపారుల కొమ్ముకాస్తూ వీలుపర్తి గ్రామ ఉపసర్పంచ్ గోకాడ అచ్చం నాయుడును బొద్దాం గ్రామంలో గల తన కార్యాలయానికి పిలిపిం చుకొని కొనుగోలుదారుల సమక్షంలో బెదిరించినట్లు గోకాడ అచ్చం నాయుడు బుధవారం విలేకరుల సమక్షంలో కన్నీరు మున్నీరయ్యారు. రైతుల పక్షాన మాట్లాడినందుకు గాను ఆగ్రహం వ్యక్తం చేసిన సీఐ తనపై రౌడీషీట్ ఓపెన్ చేస్తానని నా సంగతి నీకు తెలియదు. నీవు ఆ భూముల అమ్మకాల వ్యవహారంలో కలుగచేసుకుంటే తప్పుడు కేసులు బనాయించి, నీకు రాజకీయ జీవితం లేకుండా చేస్తానంటూ నానా బండబూతులు తిట్టారని ఉపసర్పంచ్ అచ్చంనాయుడు వాపోయారు. ప్రభుత్వ భూముల విక్రయాలపై జిల్లా అధికారులపై ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని గ్రామస్తులు గోకాడ చిన్న అప్పలనాయుడు, పి.ప్రసాదు, గోకాడ కన్నంనాయుడు, సత్యారావు, శ్రీను, ఉల్లి సన్నిబాబు, సీతమ్మ, గోకాడ నర్సిబాబు, అప్పలనాయుడు, కంబాల ముత్యాలయ్య, లక్కవరపు అచ్చన్న, శంకర్, తదితరులు ముక్తకంఠంతో హెచ్చరిస్తున్నారు. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూముల విక్రయాలపై దృష్టి సారించి విక్రయాలను అరికట్టి నిరుపేద రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై తహశీల్దార్ కే. సత్యంను వివరణ కోరగా.. వీలుపర్తి రెవిన్యూలో గల గేడ్డ వాగు ఢీ - పట్టా భూముల విక్రయాలపై రైతుల నుండి వచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి జిల్లా అధికారులకు నివేదికలు అందించడంతోపాటు అందుకు బాధ్యులైన వారిపై తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని తహశీల్దార్ కే.సత్యం అన్నారు.

ఉపసర్పంచ్ అచ్చం నాయుడు

భవిత కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలి

ఎంఈఓ విజయ్‌కుమార్, ఐఈ సమన్వయకర్త సూర్యారావు

విశాలాంధ్ర-నెల్లిమర్ల: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించాలని నెల్లిమర్ల ఎంఈఓ ఈపు విజయ్ కుమార్, సహిత విద్య జిల్లా సమన్వయకర్త ఎస్ సూర్యారావు పిలుపు నిచ్చారు. భవిత కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలని కోరుతూ నెల్లిమర్ల పట్టణంలో బుధవారం క్యాంపెయిన్ నిర్వహించారు. తల్లిదండ్రు లను కలిసి దివ్యంగులైన పిల్లల కోసం ప్రభుత్వం నడుపుతున్న భవిత కేంద్రాల గురించి వివరించారు. విద్యా బోధనతో పాటు ఫిజియో థెరపీ, స్పీచ్ థెరపీ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే పిల్లలకు అవసరమైన పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహిత విద్య సహాయ సమన్వయకర్త భారతి, ఉపాధ్యాయులు బెల్లాన అప్పలనాయుడు, పురుషోత్తం నాయుడు పాల్గొన్నారు.

పలు కార్యక్రమాలపై రివ్యూ నిర్వహించిన ఎంపీడీవో వావులపల్లి శ్రీనివాసరావు

విశాలాంధ్ర -రాజాం: రాజాం మండల పరిషత్ కార్యాలయంలో బుధ వారం పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బందితో, దినసరి వేతనం, ఫార్మ్‌పాండ్, హార్టికల్చర్, పర్సన్ డేస్ ,వర్క్ సైట్ ఫెసిలిటీస్,న్యూ స్టాటజి వర్క్స్ గుర్తింపు పైన ఎంపీడీవో వావిలా పల్లి శ్రీనివాసరావు రివ్యూ చేయడం జరిగింది.

చెరువు గట్టును యధావిధిగా తయారు చేయండి

రాతి క్రషర్ యజమానికి ఆదేశించిన ఇరిగేషన్ జేఈ

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని వావిలపాడు రెవిన్యూలో సర్వే నంబర్ 96 కుబిరెడ్డి వాని చెరువు గట్టుపై సిర్ల రామారెడ్డి రాతిక్రసర్ యజమాని తన రాతి క్రషర్ కు అక్రమంగా రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు విశాలాంధ్ర దినపత్రికలో వచ్చిన వార్తకు స్పందించిన ఇరిగేషన్ జేఈ హేమకుమార్ బుధవారం సంఘటన స్థలానికి చేరుకొని కుబిరెడ్డి వాని చెరువుగట్టును పరిశీలించారు. ఈ మేరకు రాత్రి క్రసర్ యజమానికి ప్రభుత్వ చెరువుగట్టుపై రోడ్డు నిర్మాణం చేపట్టడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చెరువు గట్టులపై ఎలాంటి రోడ్డు నిర్మాణాలు చేపట్టడం గానీ, ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి ఎలాంటి పనులు చేపట్టిన చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు.అలాగే చెరువుగట్టు గతంలో ఏ మాదిరిగా ఉండేదో అలా తయారు చేయించాలని క్రషర్ యజమానికి ఆదేశించారు. అలాగే సర్వే నంబరు 99లో గల సబ్బవరపు బంధను ఆయనతో పాటు మండల సర్వేయర్ జి. అప్పల నాయుడు మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామలక్ష్మి వీఆర్వో ప్రసాద్ సచివాలయం సర్వేయర్ నవీన్ లు రోవర్ తో సర్వే చేసి ఆక్రమణ గుర్తించి చెరువులో ఉన్న క్రషర్ మెటీరియల్ను దగ్గరుండి తొలగించారు.అలాగే రేకుల షెడ్డు కూడా తొలగించాలని క్రసర్ యజమానికి ఆదేశించండం జరిగింద న్నారు. ఇకపై ప్రభుత్వ భూములను ఆక్రమించిన చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇరిగేషన్ జేఈ హేమకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మండల అధికారులు రెవిన్ సిబ్బంది పాల్గొన్నారు.

పాతబొబ్బిలి సరేపోలమ్మ సినిమానోత్సవ పండుగలో విద్యుత్తు, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణంలో పాత బొబ్బిలి, గొల్లపల్లిలో అమ్మవార్ల పండుగ సందర్భంగా తాగునీరు, విద్యుత్తు అంతరాయం కారణాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంగళవారం రాత్రి 8,గంటల నుండి బుధవారం ఉదయం 9:30 నిమిషాల వరకు త్రాగడానికి నీరు లేక, ఇంట్లో విద్యుత్తు లేక అనేక వార్డులో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ శాఖ సిబ్బంది అధికారులు నిర్లక్ష్యం వలన, మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం పై ప్రజల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో పీజీ అడ్మిషన్లకు గడువు పెంపు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: విజయనగరంలో ఉన్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ద్వారా అందిస్తున్న వవివిధ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్ లలో ప్రవేశాల కొరకు తుది గడువును ఈ నెల 26వ తేదీ రాత్రి 11:55 నిమిషాల వరకు పొడిగిస్తున్నట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ తేజస్వి కట్టిమణి తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి గాను ఎన్టీఏ నిర్వహించిన సీయుఈటీ (పిజి) పరీక్ష రాసిన వారు పీజీ ప్రోగ్రామ్ లకు www.ctuap.ac.in గాని, లేదా https:// ctuapcuet. samarth. edu.in/pg ద్వారా తమ పేరును ఈనెల 26 లోపు రిజిస్టర్ చేసుకోవాలని ప్రో.కట్టిమని తెలిపారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ క్యాంపస్ లో ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్ ను లేదా, 6300443499 మొబైలు నెంబర్ ను గాని యూనివర్సిటీ పని వెళలలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఎంపికైన 26 మందికి కంటి ఆపరేషన్లు



విశాలాంధ్ర-వంగర: మెట్ట మగ్గూరు గ్రామంలోరామమందిరం వద్దను ఉచిత కంటి వైద్య శిభిరం నిర్వహించారు. బుదవారం రాగోలు జెమ్స్ హాస్పటల్ వైద్యులు డాక్టర్ అప్పలకొండ కళ్ళ పరీక్షలు చేశారు.ఈ ఉచిత కంటి వైద్య శిబిరం నకు 66 మంది కి పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 26 మంది కంటి ఆపరేషన్ లకు ఎంపికయ్యారు. హాజరైన 66 మంది కళ్ళ పేషంట్ల కు వీరికి వివిధ రకాల కళ్ళ పరీక్షలు డాక్టర్ చేశారు.ఇందులో 26 మంది కళ్ళ ఆపరేషన్ కు ఎంపిక చేశారు. వీరిని జేమ్స్ హాస్పటల్ కు రిఫర్ చేసినట్లు డాక్టర్ అప్పల కొండ తెలిపారు. ఆపరేషన్ కు ఎంపిక కానివారికి అవసరమైన మందులను డాక్టర్ అప్పల కొండ పేషెంట్లకు అక్కడే అంద జేశారు. అపరేషన్ కు ఎంపికైన పేషంట్ల నుజేమ్స్ హాస్పటల్ కు హాస్పటల్ బస్సులో తరలించ నున్నా రు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అప్పలకొండ, కంటి పరీక్షలకు వచ్చిన పేషంట్లు, పిఅర్ఓ వై.కన్నారావు, ఆశావర్కర్ బంకురు రమా గ్రామ పెద్దలు తదితరులు హాజ రయ్యారు. ఈ కార్యక్రమం మగ్గూరు గ్రామానికి చెందిన జీ.కే.నాయుడు ఆద్వర్య లో ఈ శిబిరం ఏర్పాటు చేశారు.

CHANGE OF NAME & DOB

P.Laxmana Rao Father of no. 16118179Y NK.Durga Rao Pandiri (2 Engr Regt, C/o 56APO) Have Changed my name and DOB from **P.Pandiri Lakshmanarao, 23-07-1956 to Pandiri Laxmanarao, 29-03-1940.** vide affedavit dated **08-05-2024** sworn before notary prayagraj my mother's name is **Durgamma.P 09-12-1956** which has been changed to pandiri Durgamma, **08-02-1960.** vide affidavit dated **23-05-2024** sworn before notary prayagraj. AJS-

లిఫ్ట్ ఇచ్చి చైన్ దొంగిలించాడు..

వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు



విశాలాంధ్ర-విజయనగరం టౌన్: పట్టణంలో చైన్ స్నాచింగ్ కు పాల్పడిన నిందితుడిని 24గంటల్లోనే అరెస్టు చేసి, అతని వద్ద నుండి చోరీ చేసిన చైను, స్కూటీ ని రికవరీ చేసినట్లుగా వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. విజయనగరం పట్టణం కొత్త అగ్రహారం ఆంజనేయ స్వామి గుడి వద్ద గాజులరేగ వెళ్లేందుకు అరబిందోలో పని చేస్తూ, గాజులరేగలో నివాసం ఉంటున్న కే.షణ్ముఖ వెంకటేష్ అనే వ్యక్తి మే 21న ఆటో కోసం వేచి ఉండగా, ఒక వ్యక్తి స్కూటీ పై వచ్చి, తాను కూడా గాజులరేగ వైపు వెల్తున్నానని, లిఫ్ట్ ఇస్తామని చెప్పడంతో షణ్ముఖ వెంకటేష్ అతని స్కూటీ ఎక్కగా, మార్గ మధ్యంలో మాటల్లో పెట్టి, అతని మెడలోని చైను దొంగిలించినాడు. ఈ విషయాన్ని తరువాత గుర్తించిన షణ్ముఖ వెంకటేష్ వన్ టౌన్ పి.ఎస్.లో ఫిర్యాదు చెయ్యగా, పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.వన్ టౌన్ క్రైమ్ ఎసై జే. తారకేశ్వరరావు, క్రైం హెచ్.సి. అచ్చిరాజు మరియు ఇతర పోలీసు బృందం దర్యాప్తు ప్రారంభించి, చైన్ స్నాచింగ్ కు పాల్పడిన వ్యక్తిని పట్టణంలోని లంకాపట్నంకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. క్రైమ్ పోలీసు బృందం చైను దొంగతనంకు పాల్పడిన ధన్నాన యేసు ను మే 22న %చీజూ% థియేటర్ దగ్గరలో అరెస్టు చేసి, చోరీ చేసిన బంగారు చైను, ఉపయోగించిన స్కూటీని స్వాధీనం చేసుకొని, నిందితుడిని రిమాండుకు తరలిస్తున్నట్లుగా వన్ టౌన్ సిఐ బి.వెంకటరావు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తుల వాహనాలు ఎక్కే ముందు వారి వాహనాల నంబరును గుర్తు పెట్టుకోవడం చాలా అవసరమని, అనుమానం ఉంటే అటువంటి వ్యక్తుల వాహనం ఎక్కపోవడం ఉత్తమమని, ప్రజలు ఇటువంటి విషయాలను దృష్టిలో పెట్టుకొని, విజ్ఞతతో వ్యవహరించాలని సిఐ వెంకటరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.కేసును 24 గంటల్లోనే ఛేదించిన ఎస్సై జే.తారకేశ్వరరావు మరియు ఇతర క్రైం బృందాన్ని సిఐ అభినందించారు.